ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3 మహబూబాబాద్
బుధవారం 6 నవంబరు 2024

'రోడ్ల వెంట చెత్తవేస్తే చర్యలు తప్పవు'

మహబూబాబాద్ టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల వెంట ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేస్తే చర్యలు తప్పవని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి హెచ్చరించారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని మదర్‌థెరిస్సా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, నర్సంపేట రోడ్డు, ఇల్లందు రోడ్, కురవిరోడ్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జీ, కురవి రోడ్‌లో మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాలువచ్చిన సమయంలో అందులో వేయాలన్నారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, కరుణాకర్, క్రాంతి, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.



సర్వం సిద్ధం

నేటి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

- జిల్లాలో 2.45 లక్షల కుటుంబాలు, 1,884 మంది ఎన్యూమరేటర్లు
- ఒక్కొరికి 150 నుంచి 175ఇళ్ల కేటాయింపు
- పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్
- కులగణన సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ
- సర్వే ఫారంలో 56 అంశాలు, 74 ప్రశ్నలు
- ఇళ్లకు స్టిక్కర్లు వేయనున్న సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఈ కులగణనలో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం శిక్షణను ఇచ్చింది. జనాబా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం భావిస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కులగణనకు నేటి నుంచి శ్రీకారం చుట్టనుంది. ఇందులో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించనున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో బుధవారం నాడు లాంచనగా ప్రారంభించి, ఈనెల 30 వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేసి. ఏర్పాట్లు పూర్తి చేశారు. కులగణన నిర్వహణకు జిల్లా నుంచి ఆరుగురిని డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌గా ఎంపిక చేయగా, వారికి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన మాస్టర్‌ట్రైనర్స్ జిల్లాలోని మండల స్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

మానుకోట జిల్లా కేంద్రంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తి చేశారు. ఈనెల 4న తిరిగి జిల్లా కేంద్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిమండలాల సిబ్బందికి శిక్షణ అందించారు. వారికున్న సందేహాలను నివృత్తి చేసి, కులగణనకు సంసిద్ధులను చేశారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ నేతృత్వంలో కులగణన నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అధికారులకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సూచనలు ఇచ్చారు. ఈనెల 2న హన్మకొండ కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ సభ్యులు సమావేశాన్ని నిర్వహించి, బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

గ్రామాలు, మున్సిపాలిటీలలో..

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 461 గ్రామ పంచాయతీల్లోని 2,45,953 కుటుంబాల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించనున్నారు. జిల్లాలో 1,884 మంది ఎన్యూమరేటర్లను నియమించగా అందులో 1,444 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), మిగతా 440 మందిని సీఆర్పీలు, ఐకేపీ వీవోలు, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లను తీసుకున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లను సర్వే చేయనున్నారు. ఇక 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక్క సూపర్ వైజర్ చొప్పున జిల్లాలో 186 మందిని నియమించారు. మండల స్థాయి అధికారులు డీటీ, ఆర్ఐలు, ఎస్సోలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలను సూపర్‌వైజర్లు గా నియమించారు. వీరు ఒక్కో ఎన్యూమరేటర్ సర్వే చేసిన గృహాల్లో 10 శాతం ఇళ్లలో సర్వేను పరిశీలించనున్నారు. ప్రతీ మండలానికి జిల్లాస్థాయి అధికారిని ఒక నోడల్ అధికారిగా నియమించారు. వీరు ఆయా మండలాల్లో సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారు. అలాగే మానుకోట, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీలలోనూ ఈ సర్వే జరుపనున్నారు.

ఈ నెల చివరి వరకు నివేదిక..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఫారం 8 పేజీల్లో 56 అంశాలతో 75 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి దానిని పూర్తి చేయాల్సి ఉంటుంది. యజమాని పేరు, ఆధార్‌కార్డు, కుటుంబసభ్యుల పేర్లు, ధరణి పాస్‌బుక్ నెంబరు, ఫోన్‌నెంబర్‌ను పూరించాల్సి ఉంటుంది. ఇక మిగతా అంశాలకు సంబంధించి కోడ్ ఆధారంగా నింపాల్సి ఉంటుంది. ఈనెల 6 నుంచి 21 వరకు ఇళ్లను గుర్తించి, యజమానుల పేర్లు రాసుకుని ఆ ఇళ్లకు స్టిక్కర్లను వేసి డిటెల్ సర్వేను పూర్తి చేస్తారు. 22 నుంచి 30 వరకు సర్వే రిపోర్టు డేటాను కంప్యూటర్లలో పొందు పరుస్తారు. ఈనెల చివరివరకు ఇంటింటి సర్వేను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.


సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ (ఫైల్)



నేటి నుంచి ప్రాథమిక పాఠశాలల్లో ఒంటి పూట బడులు..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొంటున్నందున జిల్లాలోని ప్రాథమిక స్కూళ్లకు ఒంటి పూట బడులను నిర్వహించనున్నారు. గతంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పాఠశాల నిర్వహణ ఉండేది. అయితే సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొంటున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బడులను నిర్వహించనున్నారు. విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టాక వారిని ఇంటికి పంపించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఉపాధ్యాయులు ఇంటింటి సర్వేను నిర్వహించనున్నారు.


మానుకోట కొత్తబజారు సిద్దార్థకాలనీలోని శ్రీనాగేంద్రస్వామి ఆలయంలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- ఆలయాలు, శివాలయాల్లో పూజలు
- పుట్టలో పాలుపోసిన మహిళా భక్తులు

6

ఫటాఫట్

అధికంగా ఫీజు వసూలు చేస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

- ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో గుండాల మురళీధర్



ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలు ఎలా ఉంది?

డీఎంహెచ్‌వో : జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లోని 21 పీహెచ్‌సీలు, 174 ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది, వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో దగ్గు, జలుబు, జ్వరాలు, చికున్ గున్యా మలేరియా సర్వేలు నిర్వహించి రోగాల బారిన పడిన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో రోగాల బారిన పడిన వారికి సిబ్బంది ఎక్కడ పరీక్షలను నిర్వహిస్తున్నారు?

డీఎంహెచ్‌వో : గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి అవసరం ఉన్న వారికి అక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అధికంగా పరీక్షలు అవసరం ఉన్నవారికి రక్తనమూనాల శాంపిల్స్ సేకరించి మహబూబాబాద్ టీహబ్‌కు తరలిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ఏం చేస్తున్నారు?

డీఎంహెచ్‌వో : గర్భిణీలకు ఎన్‌సీడీ కార్యక్రమాల కింద స్కానింగ్ నిర్వహించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. బీపీ, షుగర్, డయాలసిస్ ఉన్నవారికి అయుష్మాన్ భారత్ కార్డులు నమోదు చేసి అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : స్కానింగ్ నిర్వాహకులు ప్రజల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే డబ్బులు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికంగా డబ్బులు వసూలు చేసినా.. లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినా.. స్కా నింగ్ సెంటర్లలో ధరల పట్టికను ప్రదర్శించకపోయిన ప్రజలు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

-నెహ్రూసెంటర్ (ఆంధ్రజ్యోతి)

పంపిణీ


కేసముద్రం మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తేమ యంత్రాన్ని అందజేస్తున్న సంజీవరెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరికరాల పంపిణీ

- కేసముద్రం మార్కెట్ పరిధిలో 36 కేంద్రాలు

కేసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మరిపెడ మండలం తాళ్లఊకల్, చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే నిర్వాహకులకు తాటిపత్రులు, తేమ యంత్రాలు, ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాంటాలను చైర్మన్ గంట సంజీవరెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమార్కెట్ పరిధిలోని కేసముద్రం, ఇనుగుర్తి, మరిపెడ, చిన్నగూడూరు మండలాల్లోని 36 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలకు అవసరమయ్యే పరికరాలను మార్కెట్ తరపున అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంవో వెంకటేశ్వర్లు, ప్రత్యేకహోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, పాలక వర్గం సభ్యులు వోలం రమేష్, కొట్టం రాము, రైతు ప్రతినిధి బొబ్బాల యాకూబ్‌రెడ్డి, ఇనుగుర్తి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్ పాల్గొన్నారు.

భారీగా అక్రమ కలప అంటూ వదంతులు

- రంగంలోకి దిగి అనుమతి ఉందని తేల్చిన అటవీశాఖ

4


టేకు కలపను పరిశీలిస్తున్న జిల్లా స్ట్రైకింగ్ ఫోర్స్ రేంజ్ అధికారి సురేష్, మహబూబాబాద్ రేంజ్ అధికారి జోత్స్నదేవి, సిబ్బంది

వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- ధాన్యం సేకరణ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పెద్దవంగర, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి : వడ్ల కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దవంగరలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. క్రయవిక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా ధాన్యాన్ని అరబెట్టి తీసుకురావాలన్నారు. దళారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో తీసుకుంటే కేసులు నమోదు చేయడం తోపాటు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి గన్నీ సంచులను పొలాలకు వద్దకు ఇస్తే ఆయా కేంద్రాన్ని రద్దు చేస్తామని అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులు కల్గకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ మధుసూదన్‌రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణు మాదవ్, ఏవో గుగులోతు స్వామి నాయక్, ఏపీఎం రమణా చారి, పీఏసీఎస్ సీఈవో మురళి, ఏఈవోలు పాల్గొన్నారు.


పెద్దవంగరలో ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

రాంపూర్, చిల్లంచర్లలోని కొనుగోలు కేంద్రాల పరిశీలన

మరిపెడ రూరల్ : వర్షాకాలంలో రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మండలంలోని రాంపూర్, చిల్లంచర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయ న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులను విక్రయిం చకూడదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ పాలక వర్గ ప్రమాణస్వీకారానికి తరలిరావాలి

- హాజరుకానున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, కొండా సురేఖ

తొర్రూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరగనున్న నేపథ్యంలో కార్యక్రమానికి రైతులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్‌పిలుపునిచ్చారు. మంగళవారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, దనసరి సీతక్కతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ విప్‌లు హాజరవుతారని తెలిపారు. మండలంలోని చీకటా యపాలెం, కంటాయపాలెం గ్రామంలో రూ.18కోట్ల నిధు లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, అచ్చిరెడ్డి, వెంకటాచారి, ఉష, రవీంద్రాచారి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హమ్యానాయక్

1,210 కిలోల ఎండు గంజాయి దహనం

నెహ్రూసెంటర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గూడూరు, మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌ల పరిధిలో పట్టుబడిన 1210.5 కిలోల ఎండు గంజాయిని దహనం చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్ మంగళవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో పట్టుబడిన ఈ గంజాయిని స్టోరేజ్ చేశామని వివరించారు. ఆ గంజాయిని వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు ఆదేశాల మేరకు హన్మకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేట కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్‌లో దహనం చేసినట్లు చెప్పారు. మహబూబాబాద్ స్టేషన్ పరిధిలో 32 కేసులకు సంబంధించిన 1149.8 కిలోలు, గూడూరు స్టేషన్ పరిధిలో రెండు కేసులకు సంబంధించి 60.7 కిలోల ఎండు గంజాయి వెరసి రెండు స్టేషన్ల పరిధిలో 1210.5 కిలోల గంజాయిని దహనం చేసినట్లు పేర్కొన్నారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు, మహబూబాబాద్ జిల్లా డీపీవోలతో పాటు ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, బిక్షపతి, ఎస్సైలు రవికుమార్, ఎస్సై రాజేశ్వరి, ఎక్సైజ్ సిబ్బంది, కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.


మహబూబాబాద్ జిల్లాలో పట్టుబడిన గంజాయిని హన్మకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేట కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్‌లో దహనం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సాయుధ పోరాటానికి ప్రపంచ గుర్తింపు



పాలకుర్తి సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ



పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాల వేస్తున్న దయాకర్ రావు ←

- భూమి, భుక్తి కోసం జరిగిన పోరు అజరామరం
- నల్ల నర్సింహులు లాంటి వారు పుట్టడం ఈ గడ్డకే గర్వకారణం
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- నర్సింహులు పోరాటం గొప్పది : దయాకర్‌రావు
- పాలకుర్తిలో నల్ల నర్సింహులు విగ్రహావిష్కరణ

పాలకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు నల్ల నర్సింహులు విగ్రహాన్ని నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4వేల మంది రైతులు, ప్రజలు అమరులయ్యారని గుర్తు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటం అజరామరం అన్నారు. నర్సింహులు లాంటి యోధుడు తెలంగాణలో జన్మించడం ఈ ప్రాంతానికే గర్వకారణన్నారు. నర్సింహులు రాసిన పుస్తకాన్ని తాను ఢిల్లీకి రైల్లో వెళ్తున్న సందర్భంలో చదివినట్టు చెప్పారు. వచ్చే రెండేళ్లలో నర్సింహులకు నూరేళ్లు నిండుతాయని, ఇక్కడి ప్రజలందరు ఆయన శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేరళ, పశ్చిమ బెంగల్ లాంటి రాష్ట్రాల్లో భూమి కోసం భూస్వాములపై ప్రజలు తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. భారత దేశంలో 1920లో కమ్యూనిస్టు పార్టీ దున్నేవాడికే భూమి అనే నినాదం తీసుకువచ్చిందని గుర్తుచేశారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేశారని అన్నారు. మా దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వం అని కమ్యూనిస్టులు పోరాడినట్లు తెలిపారు.

జమిలి ఎన్నికలకు బీజేపీ సన్నాహం..

దేశంలో జమిలి ఎన్నికలు జరపించేలా బీజేపీ సిద్ధమవుతోందని, దానిని వ్యతిరేకించేందుకు ఇండియా కూటమితో కలిసి వామపక్ష పార్టీలు పని చేస్తాయని నారాయణ స్పష్టం చేశారు. ఈ రోజుల్లో ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి వెళ్తున్న నాయకులు సిగ్గుపడాలన్నారు. పార్టీ మారాలి అనుకునేవారు రాజీనామా చేసి వెళ్లాలని సూచించారు. దేశంలో మెజారిటీ ప్రజలు ఐక్యంగా ఉండాలని ప్రధాని పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు.

నర్సింహులు పోరాటం ఎంతో గొప్పదని : దయాకర్‌రావు

మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ నల్ల నర్సింహులు చేసిన పోరాటం ఎంతో గొప్పదన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొంరయ్య, షేక్‌బందగీ లాంటి పోరాట యోధులే కాకుండా కవులు బమ్మెర పోతన, పాల్కూరికి సోమనాథుడు, వాల్మీకి లాంటి వారు ఇక్కడి జన్మించినట్లు తెలిపారు. పాలకుర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ మంచి మిత్రుడని అన్నారు. నల్ల నర్సింహులు, కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాల ఏర్పాటుకు తాను సహకరించినట్లు తెలిపారు.

దేశ్‌ముఖ్‌లది నీచమైన చరిత్ర : పాశం

సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ సాయుధ పోరాట సమయంలో 150 మందిని చంపి, మహిళలను అర్ధనగ్నంగా బతకమ్మ లాడించిన నీచ చరిత్ర దేశ్‌ముఖ్‌లదన్నారు. నర్సింహులు, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిలకు ఉరి శిక్ష వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. పోరాటం గురించి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు. కార్యక్రమానికి సభ అధ్యక్షుడుగా మాచెర్ల సారయ్య, నర్సింహులు కూతురు అరుణ, సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యేలు రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, వల్లకాటి రాజ్‌కుమార్, అబ్బాస్, సింగారపు రమేష్, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మంజుల, సాంబయ్య, భార్గవ్, సుదర్శన్ కృపాకర్, చిదురాల ధనుంజయ తదితరులు ఉన్నారు.

అడవిలో దొంగలు

- వందకు పైగా టేకు చెట్ల నరికివేత
- బరిగలోనిపల్లి వద్ద ఘటన



దుండగులు నరికిన టేకు చెట్లు

ములుగు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అడవిలో దొంగలు పడ్డారు. జిల్లాకేంద్రానికి సమీపంలోనే తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. వందకుపైగా టేకు చెట్లను నరికివేసి తరలించారు. ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ ములుగు రేంజ్ ఇంచర్ల బీట్ పరిధిలోని బరిగలోనిపల్లి శివారు వరహాలగుట్ట సమీప అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు టేకు చెట్లను నరికివేశారు. అధికారుల కళ్లుగప్పి ఎవ్వరికీ అనుమానం రాకుండా వారం రోజులుగా నరివేతకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. పెట్రోల్, బ్యాటరీతో పనిచేసే రంపపు యంత్రాలను ఉపయోగించినట్లు స్పష్టమవుతోంది. దుంగలను వాహనాలలో రాత్రివేళ రహస్య ప్రాంతాలకు తరలించారు.

గతంలో జంగాలపల్లి వద్ద ఉన్న ఫారెస్టు చెక్‌పోస్టును ఎత్తివేసినప్పటికీ ఇటీవల జాతీయ రహదారిపై నిఘా పెరిగింది. పోలీసులు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల భయంతో స్మగ్లర్లు టేకు దుంగలను సమీప గ్రామాలలోనే భద్రపరిచినట్లు తెలుస్తోంది. కాగా, ఈ ఇటవీ ప్రాంతంలోనే ఏడాది క్రితం టేకు చెట్లను నరికిన ఘటన జరిగింది. అప్పట్లో విచారణ జరిపిన అధికారులు సంబంధిత పరవేక్షణ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. తాజాగా వెలుగుచూసిన ఘటనపై ఫారెస్టు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఫొటోలు, వీడియోలను తెప్పించుకున్న రేంజ్ అధికారి క్షేత్రస్థాయిలో తనిఖీకి ఆదేశించినట్లు సమాచారం. చెట్లను నరికిందెవ్వరు..? సొంత శాఖ సిబ్బంది ఎవ్వరైనా సహకరించారా..? దుంగలను ఎక్కడికి తరలించారు..? అనే పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు.

టీజీవో మానుకోట జిల్లా నూతన కమిటీ ఎన్నిక



టీజీవో జిల్లా కమిటీ బాధ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని డీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం టీజీవో జిల్లా నూతనశాఖ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎం.వేలాద్రి, సహాయ ఎన్నికల అధికారిగా బోళ్ల రాజేష్‌రెడ్డి వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ రఫీ, అసోసియేట్ అధ్యక్షుడిగా వేల్పుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బానోత్ జగదీశ్వర్, వేముల సురేష్, డాక్టర్ రాజ్‌కుమార్, హరిప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, కార్యదర్శిగా కొప్పు ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా పి.సదానందం, తిరుపతి రెడ్డి, అబ్దుల్ మాలిక్, డాక్టర్ వి.నరేష్ ఎన్నికయ్యాయరు. మహిళా సహాయ కార్యదర్శిగా డాక్టర్ ప్రియదర్శిని, కోశాధికారిగా డాక్టర్ బి.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.సోమ్లానాయక్, పబ్లిసిటీ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్, ఆఫీస్ సెక్రటరీగా గణేష్, కల్చరల్ సెక్రటరీగా జి.సంజీవ, స్పోర్ట్స్‌అండ్‌గేమ్స్ సెక్రటరీగా మున్వర్‌బేగ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా బి.వీరన్న, బి.శ్రీనివాస్, అప్సర్‌పాషా, మహిళా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జ్యోత్స్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రెసిడెంట్ బి.శ్యామ్, కోశాధికారి ఎం. ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్, మానుకోట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు పమ్మినాగబ్రహ్మాచారి, కృష్ణార్జునరావు, ఎల్లయ్య, రవీంద్రరావు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన టీజీవో బాధ్యులు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు.



కాలసర్ప నివారణ దోష పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు

మహదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమాసం కావడంతో భక్తులు కాలసర్ప దోష నివారణ పూజలతో పాటు నవగ్రహ పూజలు, అభిషేకాలు, పలు ప్రత్యేక పూజలు చేశారు.

గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి గోదావరి మాతకు పలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉద యం నుంచే పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కార్తీకమాసం కావడంతో పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. దీనికి ఇతర ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఐదుగురు పేకాటరాయళ్ల అరెస్ట్

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీలో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు జవహర్‌నగర్‌కాలనీలోని మాలోతు రవి అనే వ్యక్తి ఇంట్లో రైడ్ చేయగా ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ. 22,110 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో

సమయపాలన ఏదీ ?

కాటారం డివిజన్‌లో స్థానికంగా ఉండని ఉపాధ్యాయులు

మహదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్య, అభివృద్ధి దిశగా సర్కారు పాఠశాలల్లో ఇటీవల కొత్త ఉపాధ్యాయులను నియమించింది. సర్కారు బడులను బలోపేతం చేసే దిశగా పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొకటిగా తీరుస్తూ ముందడుగు వేస్తోంది. ఈ క్రమంలో మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హర్, కాటారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటి ంచడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం వేళల్లో ఆలస్యంగా వస్తూ సాయంత్రం వేళల్లో తొందరగా వెళ్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులు పనిచేసే ప్రాంతాల్లోనే సానికంగా ఉండాలని ఆదేశాలు ఉన్నా ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకపోవడంతో సమయపాలన తప్పుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు వరంగల్, హనుమకొండ, పెద్దపల్లి, మంచిర్యాల తదితర పట్టణ ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తూ పనిచే స్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు భూపలపల్లి జిల్లా కలెక్టర్ స్థానికంగా ఉండాలని సమయ పాలన పాటించాలని పలు సందర్భాల్లో సూచించినా కొంత మంది ఉపాధ్యాయులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా మండాలాల్లోని ప్రభుత్వ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో బోధన కుంటుపడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమయపాలన పాటించాలని, మెరుగైన బోధన సాగేలా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

వృద్ధురాలి ఆత్మహత్య

కేసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీలో సోమవారం రాత్రి అనారోగ్య సమస్యలతో కొమ్ము ముత్తమ్మ (63) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ మంగళవారం తెలిపారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద క్రిమిసంహార మందుతాగగా ఆమెను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడా సంబురం

- ఘనంగా సైక్లింగ్ పోటీలు షురూ
- రెండు రోజులు రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు
- పాల్గొంటున్న 382 మంది క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన ఏసీపీ

లింగాలఘణపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీసులు మంగళవారం జనగామ జిల్లా లింగాలఘణపూరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలను జనగామ ఏసీపీ పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన 382 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే క్రీడాకారులు లింగాలఘణపురం చేరుకున్నారు.



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ పార్థసారథి

ముఖ్యఅతిథి ఏసీపీ మాట్లాడుతూ సైక్లింగ్ పోటీలు క్రీడాకారుల్లో మానసికోల్లాసంతో పాటుగా శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు గ్రామీణప్రాంత క్రీడాకారుల్లో ఆసక్తి పెరగడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి లోనే కాకుండా జాతీయస్థాయిలో క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలను మెరుగుపరుస్తాయన్నారు. అంతర్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు జనగామ జిల్లాలోని లింగాలఘణపురం మండలం వేదిక కావడం గర్వకారణమన్నారు. అంతర్‌జిల్లా స్థాయి పోటీలు జనగామ జిల్లా ప్రాంత యువతకు ఎంతగానో ఉపకరిస్తుందని సూచించారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, ఉమ్మడి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కృషి అభినందనీయమన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఏసీపీ ఆకాంక్షించారు.

తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కాంత్‌రావు మాట్లాడుతూ సైక్లింగ్ పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో జనగామ జిల్లాలో నిర్వహించడం మొదటిసారి అన్నారు. సైక్లింగ్ పోటీల పట్ల గ్రామీణ ప్రాంత క్రీడాకారులు దృష్టిసారించి తమలో అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని సూచించారు. కార్యక్రమంలో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్, జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐత కిషన్‌తో పాటుగా ఫిజికల్ డైరెక్టర్లు రవి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ మధుసూదనాచారిని సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్థులు

సల్లంగ చూడు పెద్దమ్మ తల్లి

- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

మొగుళ్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సల్లంగా చూడాలని తెలంగాహన మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వేడుకున్నారు. మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు మంగళవారం ముదిరాజ్ కులస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ కులస్థులు మధుసూదనాచారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పెద్దమ్మతల్లి దేవాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, నాయకులు చదువు అన్నారెడ్డి, కొడారి రమేష్, జోరిక సదయ్య, కృష్ణారెడ్డి, ప్రభురెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు. మండలకేంద్రంలో ముది రాజ్ కులస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయం బుధవారం ప్రారంభంతోపాటు విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనుంది.

కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

ముగ్గురు సూపర్‌వైజర్లను విచారించిన అధికారులు

కాకతీయఖని, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో విజిలెన్స్(ఎస్‌టీపీపీ) అధికారుల విచారణ కొనసాగుతోంది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్- 3లో జరిగిన పలు అవకతవకలపై వారు పూర్తి స్థాయిలో కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. మంగళవారం నలుగురు సింగరేణి సూపర్‌వైజర్లను విచారణకు పిలువగా ముగ్గురు మాత్రమే విచారణకు హాజరైనట్లు సమాచారం. కాగా వారిని రీడింగ్, ఇన్వాయిస్‌లో సంతకాలు, రికార్డుల విషయాలపై అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. లోడర్ల విషయంలో జరిగిన అవకతవకలకు సూపర్‌వైజర్లకు ఎలాంటి సంబంధంలేని సదరు సూపర్‌వైజర్లతో లెటర్ రాయించి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఎంక్వయిరీలో విజిలెన్స్ అధికారులు నమ్మలేని నిజాలు బయ టకు వస్తున్నట్లు సమాచారం. అయితే కిందిస్థాయి అధికారులను విచారించడం త్వరగా పూర్తి చేసి పై స్థాయి అధికారులను విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని కార్మికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన వాహనాల టెండర్‌లో డబ్బులు చేతులు మారినట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సంబంధిత టెండర్ దారులను విచారించి వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

13న వాహనాలకు వేలం

నెహ్రూసెంటర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సారా, బెల్లం సరఫరా, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 13న వేలం వేయనున్నట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలతో పాటు కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల, బయ్యారం పోలీస్‌స్టేషన్లలో పట్టుబడిన వాహనాలకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల వేలంలో పాల్గొనే ఔత్సాహికులు మహబూబాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం పేరిట డీడీ తీయాలని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన డీడీని కార్యాలయంలో అందించి 13న ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా అక్రమ కలప అంటూ వదంతులు

రంగంలోకి దిగి అనుమతి ఉందని తేల్చిన అటవీశాఖ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారంలో భారీగా అక్రమ కలప ఉందంటూ మంగళవారం వదంతులు రావడంతో జిల్లా స్ట్రైకింగ్ ఫోర్స్ రేంజ్ అధికారి సురేష్, మహబూబాబాద్ రేంజ్ అధికారి జోత్స్నదేవిలు సిబ్బందితో సహా అనంతారం చేరుకున్నారు. అక్కడ నిల్వ ఉంచిన టేకు కలపను పరిశీలించారు. కలప నిల్వ చేసిన యాజమానుల వద్ద ఉన్న పర్మిట్ కాగితాలను పరిశీలించారు. అనంతారంలో భారీ మొత్తంలో టేకు కలప డంపింగ్ అయినట్లు సోషల్ మీడియాలో పోస్టింగ్ వైరల్ కావడంతో మహబూబాబాద్ డీఎఫ్‌వో బత్తుల విశాల్ స్పందించారు. వెంటనే జిల్లా స్ట్రైకింగ్ ఫోర్స్ రేంజ్ అధికారి సురేష్, మహబూబాబాద్ రేంజ్ అధికారి జోత్స్నదేవి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. వెంటనే అనంతారంకు చేరుకుని రంగంలోకి దిగిన అటవీ అధికారులు పర్మిట్ కర్ర అని తేల్చిచెప్పారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

నెల్లికుదురు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గత రెండు రోజులు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అర్చరీ, కత్తి సాము క్రీడలు మంగళవారం రాత్రి ముగిసాయి. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్ 14 నుంచి 17 వరకు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అర్చరీ క్రీడలలో 48 మం ది విద్యార్థులు, కత్తిసాము క్రీడలలో 72 మంది విద్యార్థులను జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక చేశారు. అర్చరీలోజాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు గుజరాత్‌లో నిర్వహించే జాతీయ క్రీడలలో, కత్తిసాములో ఎంపికైన విద్యార్థులు జమ్ముకాశ్మీరులో నిర్వహించే క్రీడలలో పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గడ్డం సత్యానారయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాందాస్, ఎస్సై రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర రాష్ట్ర పరిశీలకులు రవి, హరికృష్ణ శ్రీనివాసు, పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కేసముద్రం విద్యార్థులు

కేసముద్రం : సంగారెడ్డి జిల్లాలో ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ హాకీ పోటీలకు కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం బందెల రాజు, పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు. హన్మకొండలో ఇటీవలె ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు బానోత్ విష్ణు, చరణ్, బాదావత్ సాయిమణిలు ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హెచ్‌ఎం, పీఈటీ తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ముగ్గురి ఎంపిక



ప్రణయ్



మహ్మద్ రకీబ్



శశిధర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, మెదక్‌లలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ నాకౌట్ కం లీగ్ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి బి. అజయ్‌సారథిరెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ జట్టులో స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీల్లో మన్నెం ప్రణయ్, మహ్మద్ రకీబ్, కిన్నెర శశిధర్‌లు పాల్గొనన్నుట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. వీరి ఎంపికపట్ల కోచ్ మెతకు కుమార్, సహాయ కోచ్ తోట వినయ్‌కుమార్, సభ్యులు ఆయిలి సంతోష్ హర్షం వ్యక్తం చేశారు.

యువ

సంగీతం.. సాహిత్యం..


సినీ గేయ రచయిత పరిపూర్ణాచారి


సంగీత దర్శకుడు కార్తీక్

» సంగీత దర్శకుడిగా ట్రెండింగ్‌లో కార్తీక్ » గేయ రచయితగా దూసుకుపోతున్న పూర్ణాచారి
» పల్లె జీవనం, జానపదాలే వారికి ప్రేరణ » వీరిద్దరిదీ ములుగు జిల్లాయే..

ములుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకరికి సంగీతమంటే ప్రాణం.. మరొకరికి సాహిత్యమే ఊపిరి.. అందమైన పదాలను కూర్చుగా అల్లడంలో ఒకరు దిట్టయితే.. ఆపదాలకు వినసొంపైన బాణీలు సమకూర్చడంలో మరొకరు దిట్ట.. ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం.. పక్కపక్క ఊళ్లు.. మధ్యతరగతి కుటుంబాలు.. కష్టజీవుల వెతలు.. రోజూ వినే జానపదాలు.. వీధినాటకాలు.. పల్లె జీవన చిత్రమే ప్రేరణగా ఆ ఇద్దరు తాము ఎంచుకున్న మార్గంలో దూసుకుపోతున్నారు. క్షణక్షణం అప్‌గ్రేడ్ అవుతున్న రంగుల ప్రపంచంలో తమ టాలెంట్‌కు పదును పెట్టుకుంటూ సుస్థిర స్థానం సంపాదించుకునేందుకు కష్టపడుతున్నారు. వారే యువ సంగీత దర్శకుడు కార్తీక్ కొడకండ్ల, సినీ గేయ రచయిత చల్లూరి పరిపూర్ణాచారి.

ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన చల్లూరి లక్ష్మి, రాజమౌళి దంపతుల కుమారుడైన పరిపూర్ణాచారి కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఫార్మసీ పట్టా పొందారు. జానపద కళాకారులకు పెట్టింది పేరైన బండారుపల్లిలో పండుగలు, ఉత్సవాల సందర్భంగా స్థానిక యువకులు వీధినాటకాలు ప్రదర్శించేవారు. రామప్ప పరివాహకంలో ఏడాది పొడవునా పంటలు సాగవుతుండగా శ్రమను మర్చిపోయేందుకు కూలి తల్లుల నోట నిత్యం ఉయ్యాల పాటలు, జానపదాలు పొలిమేరలను పరవశింపజేస్తూనే ఉంటాయి. వీటి నుంచి ప్రేరణ పొందిన పరిపూర్ణాచారి ద్రౌపది వస్త్రాపహరణం, సింహబలుడు నాటకంలో పాత్రలు పోషించి పద్యాలను గొంతెత్తి పాడేవాడు. కొన్ని సినీ, జానపదాలకు పేరడీలు రాసేవారు. ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో కొన్ని స్టేజీలపై పేరడీ పాటలను పాడిన ఆయన ఆతర్వాత తన సొంత కవిత్వంపై దృష్టి సారించారు. హైదరాబాద్‌కు పయమైన ఆయన 2014లో తొలిసారి తెలుగు సినిమాకు పాట రాసే అవకాశం దక్కించుకొని వెండితెరపై తన పేరును చూసుకొని మురిసిపోయారు. 2016లో



పరిపూర్ణాచారిని అభినందిస్తున్న బాలకృష్ణ

పేరడీ నుంచి సింగిల్ కార్డు దాకా..

విడు దలైన ప్రేమమ్ సినిమా పాటతో అందరి మన్ననలు అందుకున్న ఆయన ఆ తర్వాత పూర్ణాచారిగా ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటివరకు 160సినిమాలకు 538కిపైగా పాటలు రాశారు. ఇటీవల విడుదలై విమర్శకుల చేత శభాష్ అనిపించుకున్న శివంభజే సినిమాతో పాటు మొత్తం 36సినిమాలకు సింగిల్ కార్డు గేయ రచయితగా మారారు. దాస్ కా దమ్కీ సినిమాలోని ఆల్‌మోస్ట్ పడిపోయానే పిల్లా పాటతోపాటు సవారి సినిమాలోని ఉండిపోవ నువ్విలా.. అంటూ సాగే ఇంకో పాట చారి కలం నుంచి జాలు వారినవే. తాజాగా టాలీవుడ్ ప్రతిష్టాత్మక మిర్చీ మూవీ, సినారే వంశీ ఫిల్మ్ అవార్డులను గెల్చుకున్న పూర్ణాచారి ప్రస్తుతం మ్యాడ్ స్క్వేర్, కోర్టు సినిమాలతోపాటు రవితేజ, బెల్లకొండ శ్రీనివాస్ లాంటి హీరోలు నటిస్తున్న పలు సినిమాలకు పాటలు రాస్తున్నారు.

కంప్యూటర్ వదిలి కీబోర్డు పట్టుకొని..

అందరు యువకుల్లాగే కొడకండ్ల కార్తీక్ ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరారు. తల్లి పద్మ అంగన్‌వాడీ టీచర్ కాగా, తండ్రి వెంకటాచలం ప్రైవేటు ఉద్యోగిగా పడి కష్టాన్ని చూసిన కార్తీక్ తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోంగా చేస్తూ నెలజీతంతో వారికి ఆసరగా నిలిచాడు. కానీ తాను అనుకున్నది కాలేకపోయానన్న వేదన మాత్రం ఆయనలో మిగిలేఉంది. ఈ క్రమంలో ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి ఆశయానికి అండగా నిలిచారు.. ప్రోత్సహించారు. ఫలితంగా తెలుగు సంగీతంలో తొలి బ్రీత్‌లెస్ సాంగ్‌కు అంకురం పడింది. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న కలం నుంచి జాలువారిన బంధూక్ సినిమాలోని 'పూసిన పున్నమి వెన్నెల మేన తెలంగాణ వీణ'.. పాటకు బాణీలు సమకూర్చింది మన కార్తీకే. వెంకటాపూర్(రామప్ప) మండలం


దర్శక దిగ్గజం రాఘవేందర్‌రావుతో కార్తీక్

కేశవాపూర్‌కు చెందిన కార్తీక్ ఎంటెక్ పూర్తిచేసి ఇన్ఫోసిస్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగంలో చేరాడు. మ్యూజిక్‌పై మక్కువతో కొన్నేళ్లకే ఉద్యోగాన్ని వదిలిపెట్టాడు. శాస్త్రీయ సంగీతంలో మెళకువలు నేర్చుకున్నాడు. 2015లో సినీ రంగంలోకి ప్రవేశించిన ఆయన ఇప్పటివరకు 15సినిమాలకు సంగీతం అందించారు. చిత్రీకరణ జరుపుకొంటున్న డొక్కా సీతమ్మ బయోపిక్‌తో పాటు ఉద్వేగం లాంటి రాబోయే పలు సినిమాలకు బాణీలు సమకూర్చుతున్నారు.

మెగాస్టార్ చిరంజీవి పద్మభూషణ్ అవార్డు పొందిన సందర్భంగా శిల్పకళావేదికలో 15మంది తెలుగు గాయకులతో సంగీత విభావరి నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. 2016, 2019, 2023లో ఆయన సంగీతం సమకూర్చిన బతుకమ్మ పాటలు ఇప్పటికీ యూట్యూబ్, ఇన్‌స్టాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు కూడా కార్తీక్ సంగీతం అందించారు. ఇటీవల ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రచార పాటలకు కూడా ఆయన మ్యూజిక్ ఇచ్చి చంద్రబాబు నాయుడు నుంచి ప్రశంసలు అనిపించుకున్నారు. జెట్టి సినిమాలోని దూరం కరిగినా..మౌనం కరుగునా.. పాట కార్తీక్‌కు మంచిపేరు తెచ్చింది.

వరంగల్‌కు చెందిన సినీ దర్శకుడు తరుణ్‌భాస్కర్‌తో కలిసి అనుకోకుండా.. అనే ఓ షార్ట్ ఫిల్మ్‌ను కూడా తీశారు. ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేఎస్.చిత్ర, సుశీల, బాంబే జయశ్రీతోపాటు పలువురు తెలుగు వర్ధమాన గాయకులతో కలిసి పనిచేశారు.

హైదరాబాద్‌లో సొంతంగా కేకే స్టూడియోను నడుపుతున్న ఆయన 600కు పైగా పాటలకు బాణీలు అందించారు. తానా, నాటా సంస్థల ఆహ్వానం మేరకు అమెరికాకు వెళ్లి అంతర్జాతీయ వేదికలపై మెరిశారు. ఆయన సంగీతం సమకూర్చిన 'సింగారి' అనే పాటల ఆల్బమ్ ఇటలీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది.

ఉపాయం చేశారు.. ఉపాధి పొందుతున్నారు

» ప్లాస్టిక్ మోకులతో నెలకు రూ.50 వేల సంపాదన
» తెలుగు రాష్ట్రాల్లో అబ్బయ్య 'గీత మోకుల'కు ప్రత్యేక గుర్తింపు


ప్లాస్టిక్ మోకుల తయారీకి పొట్టెలను పురిపెడుతున్న అబ్బయ్య దంపతులు

స్వయంకృషి


మోకుల తయారికి ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ పొట్టెలను చూపుతున్న అబ్బయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికంగా ఎన్నో మార్పులు, అవిష్కరణలు జరుగుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక యంత్రాలు వస్తున్నాయి. కానీ గీత కార్మికులకు అవసరమైన యంత్రాలు మాత్రం రాలేదు. వారు నేటికీ సంప్రదాయ విధానాలనే అవలంబిస్తున్నారు. ఈ క్రమంలో గీత కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్ పేరుతో కొన్ని వస్తువులను అందజేసింది. 20 ఏళ్లకంటే ముందు గీతకార్మికులు తాటిచెట్లు ఎక్కడానికి మోకులను సొంతంగా తయారు చేసుకునేవారు. తాటి మట్టకు రెండు వైపుల ఉండే గర్లు, తాటిపొట్టెలను తీసి వాటిని పురిపెట్టి బలమైన తాడును తయారు చేసుకునేవారు. అలా తయారు చేసిన మోకులు ఒకటి, రెండేళ్ల పాటు పనిచేసేవి. ఆ తర్వాత అవి దెబ్బతినేవి. కానీ అది అర్థం కాక చెట్లపైకి ఎక్కిన తరువాత మోకులు తెగి కార్మికులు కింద పడి మృత్యువాత పడేవారు. అలాగే అంగవైకల్యానికి గురి అయ్యేవారు. నాడు ఆపరిస్థితులను చూసిన జనగామ జిల్లా చిలుపూరు మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గీత కార్మికులు పూజారి రామస్వామి, పూజారి మోగిళి, ఘన్‌పూర్‌కు చెందిన దూసరి అబ్బయ్యతో కలిసి వివిధ షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ తాళ్లు (పొట్టెలు) సేకరించారు. కొన్ని పొట్టెలను చీరి వాటిని కట్టలుగా కట్టి పురిపెడుతూ బలమైన ఎంటును రూపొందించి దాని ద్వారా మోకును తయారుచేశారు. తదనంతరం ఇద్దరు కార్మికులు మోకుల తయారి నుంచి నిష్క్రమించగా నాటి నుంచి నేటి వరకు అబ్బయ్య ప్లాస్టిక్ మోకులను తాయరు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ ప్లాస్టిక్ మోకులు ఆరేళ్ల వరకు మన్నికగా ఉంటాయి. సుమారు 25ఏళ్లుగా అబ్బయ్య తన భార్య భాగ్యలక్ష్మీ, కుమార్తె సుమలత, కోడలు విజయ, మనువళ్లు అరవింద్, సిద్దులతో కలిసి మోకులు తయారు చేస్తున్నారు. వయసు రీత్యా రెండేళ్లుగా గీత వృత్తిని మానుకున్న అబ్బయ్య మోకుల తయారీపైనే దృష్టి పెట్టారు.

పలు జిల్లాల నుంచి కొనుగోలుదారుల రాక

అబ్బయ్య తయారు చేసిన మోకులను కొనుగోలు చేయడానికి గాను రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గీత కార్మికులు వస్తుంటారు. కరీంనగర్, నల్లగొండ. జనగామ, సిద్దిపేట, అదిలాబాద్, ఖమ్మం, మెదక్, మానకొండూరు, సిరిసిల్ల, మహబూబాబాద్, హన్మకొండ, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో అబ్బయ్య మోకులంటే మంచి గుర్తింపు ఉంది. నగటున ఒక మోకును రూ.800కు విక్రయిస్తుండగా.. అన్ని ఖర్చులుపోను తమకు రూ.600వరకు లాభం ఉంటుందని, రోజుకు గిరాకీ బట్టి 4 నుంచి 5 మోకులు తయారు చేస్తామని అబ్బయ్య చెబుతున్నారు. నెలంతా కష్టపడితే తమకు రూ.50వేల వరకు ఆదాయం ఉంటోందని, ఇదే తమ కుటుంబానికి ఆదాయ వనరుగా మారిందని చెబుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి మోకులు కొనుగోలు చేయడం సంతృప్తినిస్తోందంటున్నారు.

ప్లాస్టిక్ మోకుతో ధైర్యంగా ఉంది..



పూజారి రాజ్‌మోహన్, గీత కార్మికుడు, చిన్నపెండ్యాల

ప్లాస్టిక్ మోకుతో తాటిచెట్టు ఎక్కడం ధైర్యంగా ఉంటుంది. అబ్బయ్య వద్ద మూడేళ్ల క్రితం ఒక మోకును కొనుగోలు చేశా. ఈ మోకులను పటిష్ఠంగా తయారుచేయడంలో అబ్బయ్య దిట్ట అని, నాలాంటి అనేక మంది కార్మికులకు ఉపయోగపడేలా నైపుణ్యంతో మోకులు తయారు చేస్తున్న అబ్బయ్యను ప్రభుత్వం గుర్తించి తగిన పోత్సాహకం అందించాలి.

నాణ్యతకు మారుపేరుగా మోకుల తయారి



పాలకుర్తి నాగరాజు, గీత కార్మికుడు, తాటికొండ

అబ్బయ్య తయారు చేస్తున్న మోకులు ఎంతో పటిష్ఠంగా, నాణ్యంగా ఉంటాయి, బరువు కూడా తక్కువ ఉండేలా మోకులను తయారు చేయడంలో అబ్బయ్యది అందెవేసిన చేయి. వివిధ ప్రాంతాల్లో యంత్రాలపై మోకులను తయారు చేస్తుంటారు. అవి అంత నాణ్యతగా ఉండవు. కానీ చేతితో చేసే అబ్బయ్య మోకులు బలంగా ఉంటాయి. అందుకే 12 ఏళ్లుగా అబ్బయ్య వద్దే మోకులు కొనుగోలు చేస్తున్నా.

మా పూజలందుకో నాగన్న..

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

» నాగేంద్రుడికి మహిళల నీరాజనం
» పుట్టల వద్దకు పెద్ద ఎత్తున మహిళలు
» భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


రుద్రేశ్వరుడి ఆలయంలో సీపీ దంపతులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాస వేళ మంగళవారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు నాగేంద్రుడి పుట్టలున్న ప్రాంతాలకు బారులుతీరి పయనమయ్యారు. కార్తీక మాసంలో వచ్చే ఈ నాగుల చవితికి ప్రత్యేక విశిష్టత ఉంది. ఈ మాసంలో కన్యలు స్వామివారిని ప్రార్థించి అభిషేకించి మొక్కులు చెల్లిస్తే కల్యాణం జరుగుతుందని, సంతానం లేని వారు నాగేంద్రస్వామి ఆలయంలో చెట్టుకు ఉయ్యాల కడితే సంతానం కలిగి ఇంట్లో తొట్టె ఊగుతుందని భక్తుల విశ్వాసం. అంతేగాకుండా స్వామి వారికి క్షీరాభిషేకం చేసి గోత్రనామాలతో అర్చన చేయిస్తే సర్పదోషం తొలిగిపోతుందని నమ్ముతారు.

రుద్రేశ్వరాలయంలో..

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నవరసాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఉన్న పుట్టల వద్దకు తెల్లవారుజామునుంచే మహిళలు బారులు తీరి నాగేంద్రుడికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో రుద్రేశ్వరుడిని దర్శించుకొని అక్కడ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయమే సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.

హనుమకొండలో..


రుద్రేశ్వర ఆలయంలో నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమకొండ బ్రాహ్మణవాడలోని నాగుల వీధిలో మహిళలు తరలి నాగేంద్రుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామోజు సోమేశ్వర్‌రావు, చీకటి రాజు, చందుపట్ల ధన్‌రాజ్ తదితరులు భక్తులకు సహకరించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లోని పుట్టల వద్దకు, ఎక్సైజ్ కాలనీ లోని శ్రీవేంకటేశ్వరాలయం, రెవెన్యూ కాలనీలోని శ్రీరామాలయం, తదితర ప్రాంతాల్లోనూ ఉన్న పుట్టల వద్దకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకొని నాగేంద్రుడికి మొక్కులు చెల్లించుకున్నారు.

నగరంలో ఎక్కడ చూసినా మహిళలు కోలాహలంగా పుట్టల వద్దకు చేరుకునే విషయాలు ఆవిష్కృతమయ్యాయి. నాగేంద్రుడి పుట్టల వద్ద నున్న మట్టిని బంగారంగా కొలుస్తూ భక్తిశ్రద్ధలతో వేడు కలను నిర్వహించారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. నర్సంపేటలోని శివాలయంలో, వర్ధన్నపేటలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో, గీసుగొండ మండలంలోని ఊకల్ గ్రామంలో శ్రీబాలనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో వేడుకలు వైభవంగా జరిపించారు. వరంగల్ నగరంలోని ఉర్సు శంభునిపేట ప్రాంతంలో గల ప్రసిద్ధ నాగమయ్య దేవాలయం, ఎల్లంబజార్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, శ్రీభద్రకాళి దేవాలయం, ఓసిటీలోని ఆంజనేయస్వామి దేవాలయం, కాశిబుగ్గలోని శివాలయం, వెంకట్రామ జంక్షన్‌లోని శ్రీకనకదుర్గా దేవాలయం, బట్టల బజార్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, రంగంపేటలోని భవాని శంకర ఆలయం, కుంటిభద్రయ్య గుడి, మల్లికార్జున స్వామి ఆలయం, జేపీఎన్‌రోడ్డు శ్రీదాసాంజనేయ స్వామి దేవాలయంలోని నాగేంద్రస్వాములకు ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలను చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించి ఆకాశ దీపాన్ని దర్శించుకొని ఉపవాస దీక్ష విరమించారు.

సర్వే సరే.. పాఠాలు మరి!

» నెల రోజుల పాటు ప్రాథమిక విద్యకు విఘాతం
» ప్రక్రియ పూర్తయ్యే వరకు ఒంటిపూట బడులు
» ఉపాధ్యాయ వర్గాల నుంచి అభ్యంతరాలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి కులగణన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ సర్వేతో రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో సుమారు నెల రోజుల పాటు విద్యాబోధనకు విఘాతం ఏర్ప డుతోంది. దీంతో విద్యార్థులు చదువులో వెనుకబడే ప్రమాదం కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు వారాల పాటు కుల గణన సర్వేను నిర్వహించనుండటం, అం దుకు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నియమించడమే ఇందుకు కారణమవుతోంది. అయితే ఉదయం మాత్రమే పాఠశాలలను నిర్వహించి.. మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులంతా సర్వేకు వెళ్లాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ నుంచి మొత్తం 6,210 మంది కుల గణన సర్వేలో పాల్గొంటుండగా అందులో సుమారు 6 వేల మంది ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో ప్రభుత్వం చెప్పింది ఒకటి, చేస్తుంది ఒకటని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. పూర్తిగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులనే కాకుండా ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలల్లో ఉన్న ఉపాధ్యాయులను కుల గణన సర్వేలో పాల్గొనే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరకొర వసతులతో అత్తె సరు విద్య అందుతున్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల చదువులకు కుల గణన సర్వే గండి కొడుతుందన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో నెల రోజుల పాటు ఒంటి పూట బడులు నిర్వహించడం వల్ల వారి పఠనా సామర్థ్యాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉపాధ్యాయ వర్గాల అసహనం

కుల గణన విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ఉపాధ్యాయ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో చర్చకొచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి మిగులు ఉపాధ్యాయులను సర్వేకు తీసుకోవాలని, అలాగే ప్రాథమిక పాఠశాలల నుంచి కూడా సగం మంది ఉపాధ్యాయులను మాత్రమే సర్వేలో వినియోగించుకోవాలని సూచించామని కానీ ప్రభుత్వం కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రమే సర్వే చేయాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపడుతున్నారు.

అలాగే ఉదయం పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించి మధ్యాహ్నం సర్వే చేయడంపై ఉపాధ్యాయ వర్గాలు నిరాసక్తత కనబరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం వివిధ పనుల నిమిత్తం ఉదయమే బయటికి వెళతారని, మధ్యాహ్నం ఇళ్లలో ఎవరూ ఉండరని, అలాంటప్పుడు సర్వే ఎలా చేయాలని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సెలవు రోజుల్లో సర్వే నిర్వహించేలా చర్యలు చేపట్టి వారికి అదనపు సెలవులు మంజూరు చేస్తే సరిపోతుందని కొంత మంది ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచిస్తున్నారు.

జిల్లాల వారీగా సర్వేలో పాల్గొనేవారు

జిల్లా	ఉపాధ్యాయులు/సిబ్బంది
వరంగల్	1269
హనుమకొండ	844
జనగామ	960
మహబూబాబాద్	1710
జయశంకర్ భూపాలపల్లి	784
ములుగు	644

సర్వే వల్ల ఒంటిపూట నడువనున్న బడులు

జిల్లా	ప్రాథమిక పాఠశాలల సంఖ్య
వరంగల్	450
హనుమకొండ	314
జనగామ	348
మహబూబాబాద్	676
జయశంకర్ భూపాలపల్లి	365
ములుగు	372

సర్వేలో ఏం చెప్పాలి ?

నేటినుంచి కుటుంబ వివరాల సమగ్ర సేకరణ

ప్రశ్నలు, సమాధానాలపై ప్రజల్లో అనుమానాలు

ఏ వివరాలు ఇవ్వాలన్నదానిపై చర్చ


ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎన్యుమరేటర్

వర్ధన్నపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల, తెగలు, వెనుబడిన తరగతులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టింది. గత ప్రభుత్వం 2014 ఆగస్టు 19న ఒక్క రోజులో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా తమతమ ప్రాంతాలకు చేరుకోగా పండుగ వాతావరణం కనిపించింది. ఇక తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే బుధవారం బుధవారం నుంచి 10రోజులపాటు కొనసాగనుండగా.. తొలి మూడు రోజులు స్టిక్కరింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమటరేటర్, 10మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. అయితే ఈ సర్వేలో కుటుంబ సభ్యులందరూ ఉండాల్సి అవసరం లేదు. కుటుంబానికి సంబంధించిన ఎవరో ఒకరు చెబితే చాలు ఎన్యుమరేటర్లు నమోదు చేసుకుంటారు. సర్వే చేసే ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినపుడు ఏమి అడుగుతారో ? ఏమి సమాధానం చెప్పాలి ? ఏయే పత్రాలు దగ్గర పెట్టుకోవాలని ? అందరిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆస్తులు, అప్పులు చెప్పాలి

గత ఐదేళ్లలో తీసుకున్న రుణాలు, ఎందుకు తీసుకున్నారు. ఎక్కడ నుంచి పొందారు. ఏదైనా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొంటే ఆ వివరాలు తీసుకుంటారు. పశు సంపద సంఖ్య సేకరిస్తారు. స్థిరాస్థి, చరాస్థితోపాటు నివాస గృహం చదరపు గజాల్లో నివాస గదుల సంఖ్య, తాగునీటి వనరు విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్డి, వంటకోసం వినియోగించే ఇందనం లాంటి వివరాలు సేకరిస్తారు.

పాస్‌బుక్ నెంబర్, భూమి వివరాలు చెప్పాల్సిందే..

భూమి వివరాల కోసం ధరణి పట్టాదార్ పాసు పుస్తకం, నెంబర్ భూముల రకం, ఎకరాల సమా చారం చెప్పాల్సి ఉంటుంది. నీటిపారుదల వనరు, కౌలు భూమి సాగుచేస్తే సాగు విస్తీర్ణ వివరాలు నమోదు చేస్తారు.

రాజకీయ నేపథ్యం ఉంటే..

ప్రజా ప్రతినిధిగా సభ్యత్వం కింద ప్రస్తుతం పూర్వం ఏ పదవిలో ఉన్నారు. పదవీకాలం? నామినేటెడ్ వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రశ్నావళి ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారికి వర్తిస్తుంది.

రిజర్వేషన్ ఫలాలు పొందితే..

విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ విధానంతో ప్రయోజనం పొందిన, గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాల వివరాలను సర్వేలో నమోదుచేస్తారు. ఎస్సీ ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్ ధృవపత్రాలు పొందిరా ? డీ నోటిఫై చేయబడిన పాక్షి సంచార తెగక సమాచారాన్ని అవును, కాదనే వివరాలను నమోదుచేస్తారు.

ఏమేం తెలుసుకుంటారంటే ?

సాధారణ వివరాల కింద కుటుంబ యజమాని, సభ్యుల పేరు, సంబంధం మతం, సామాజిక వర్గం, మతం, వయసు, ఆధార్‌కార్డు నెంబరు (ఇస్తే ఇవ్వవచ్చు), మొబైల్ నెంబర్, దివ్యాంగులైతే వైకల్యం, వైవాహిత స్థితి గురించి ఆరా తీస్తారు. విద్యా వివరాల కింద పాఠశాల్లో చేరిన నాటి వయసు, ఏ మాధ్యమంలో చదివారు. బడి మానేస్తే. వివరాలు చెప్పాల్సిందే. ఉద్యోగ, ఉపాధి వివరాలకు సంబంధించి ప్రస్తుతం చేసే వృత్తి, ఉద్యోగ సమాచారం, వార్షిక ఆదాయం, ఒక వేళ వ్యాపారులైతే వార్షిక ఆదాయం చెప్పాలి. ప్రధాన కుల వృత్తులైతే. ప్రస్తుతం కొనసాగుతున్నారా? వృత్తి పరంగా వ్యాధి (ఉంటేనే), ఆదాయం పన్ను చెల్లింపుదారుల వివరాలు, బ్యాంకు ఖాతా ఉంది / లేదు. వంటి వివరాలను చెప్పాల్సిందే.

వలసలకు కారణం..

కుటుంబీకుల్లో ఎవరైనా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలస వెళితే ఆ వివరాలను కూడా నమోదు చేస్తారు. వలస వెళ్లడానికి కారణం కూడా ఆరాతీస్తారు.

ఫొటో తీయరు.. పత్రాలు తీసుకోరు ?

సర్వే సందర్భంగా కుటుంబీకుల ఫొటోలు తీయరు. ఎలాంటి పత్రాలు తీసుకోరు. అందరూ ఉండాల్సిన అవసరంలేదు. కుటుంబ యజమాని ఉండి వివరాలను చెబితే సరిపోతుంది. ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు..

సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. ఇందు కోసం 56 పదాల ప్రశ్నలు, మరో 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. పార్టు 1, 2, కింద 8 పేజీల్లో సమాచారం పూరిస్తారు. ఇందులో పార్టు -1లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తి వివరాల కింద సాధారణ, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజ నాలు, రాజకీయ, వలసల సమాచారం అడుగుతారు. పార్టు -బీ కింది కుటుంబ వివరాలను సేకరిస్తారు. ఇందులో 17 ప్రశ్నల్లో 7 ప్రధాన, మిగిలిన అనుబంధ ప్రశ్నలు ఉంటాయి.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కురవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కురవిలోని రైతువేదికలో ఈనెల 7న విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు టీజీఎస్పీడీసీఎల్, విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్‌వి.గోపాలచారి, చైర్‌పర్సన్ కె.రమేష్, డీఈ విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుదంధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెరుగుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపులోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరుమార్పు వంటి ఫిర్యాదులు స్వీకరిస్తామని వినియోగదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఒంటిపూట బడులతో విద్యార్థులకు ఇబ్బందులు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొననున్నందున ఒంటి పూట బడులు కొనసాగనున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతాయని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎన్.భాస్కర్ పేర్కొన్నారు. కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాజు, నాగరాజు, విజయ్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

బయ్యారంలో 14 వేల కుటుంబాలు

బయ్యారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న కులగణన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా బయ్యారంలో చేపట్టే కులగణన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మీ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 14,316 కుటుంబాలకు గాను 154 ఎన్యుమేటర్ బ్లాక్స్ 106 ఎన్యుమేటర్స్‌తో పాటు సర్వే పరిశీలన నిమిత్తం 10 సూపర్ వైజర్లను నియమించినట్లు వెల్లడించారు. కాగా, ఫార్మెట్‌లోని 75 అంశాలపై ఎన్యూమేటర్స్ సర్వే చేపట్టనున్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని మునిసిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాయిరాం అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని రజాలీపేటలో పూర్వ జీపీ స్థలం ప్రభుత్వ భూమికి మునిసిపల్ అధికారులు మంగళవారం హద్దులు కేటాయించి ఫెన్సింగ్ చేశారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

• పుట్టలో పాలుపోసిన మహిళా భక్తులు


మానుకోట శ్రీమహా గాయత్రీదేవి ఆలయంలో భక్తులకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి పర్వదిన వేడుకలను మంగళవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తీకమాస శుద్ధచవితి రోజున నాగుల చవితి పర్వదినాన్ని జరుపుకుంటారు. నాగుల చవితి పండుగను పురస్కరించుకుని మహిళలు ఉదయాన్నే తలంటు స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి శివాలయాలు, నాగదేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టల్లో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. ఏటా శ్రావణమాసంలో


నర్సింహులపేట మండలకేంద్రంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు

నాగపంచమి రోజున, కార్తీక మాసంలో నాగులచవితి రోజున పుట్టల్లో పాలుపోస్తే సుఖసంతోషాలు, అష్టఐశ్వర్యాలు దక్కుతాయని ప్రతీతి. ఉదయం నుంచి శివాలయాలు, రామాలయాలు, వివిధ వైష్ణవ దేవాలయాలకు చేరుకున్న మహిళలు నాగదేవత పుట్టపై కుంకుమ, పసుపు, పూలుచల్లి పుట్ట వద్ద కోడిగుడ్డును పెట్టి పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహబూబాబాద్ పట్టణం కొత్తబజారు సిద్ధా


మానుకోట నాగమయ్యగుడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఉమా

ర్థకాలనీలోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, పాత బజారులోని శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయం, శిఖార్‌ఖాన్‌గడ్డలో ఉన్న శ్రీముత్యాలమ్మ తల్లి దేవాలయం, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ముత్యాలమ్మ దేవాలయం, పట్టణ శివారు నర్సంపేటరోడ్‌లో ఉన్న శ్రీమహాగాయత్రీ దేవాలయాలకు చేరుకున్న మహిళలు, భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల ఆవరణలో ఉన్న నవగ్రహాలకు పూజలు చేశారు. ఆలయాలకు చేరుకొని నాగదేవత పుట్టలో పాలుపోసి పూజలు చేశారు.

మానుకోట పట్టణంలోని 36వ వార్డులోని నాగమయ్యగుడిలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సతీమణి మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ ఉమా నాగుల చవితివేడుకలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, వార్డు కౌన్సిలర్ బి.నీరజాదర్శన్న, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, దేవాలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు డేగల సత్యనారాయణ, నీలం శ్రీనివాస్, మాధవ్, గుంటి శ్రీధర్, గోపి, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, మాధవ్, వినయ్, అంజయ్య, సరోజన, పెరుగు కుమార్, రవీందర్ పాల్గొన్నారు. తొర్రూరు పట్టణంలోని పంచముఖ నాగేంద్రస్వామి ఆలయంలో పురాతన పుట్టలో పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి రంజిత్, ఆలయ కమిటీ బాధ్యులు ప్రసాద్, వెంకటరమణ, చంద్రకళ, రాంబాబు, నాగేశ్వర్‌రావు, నాగేంద్రాచారి, నాగశివ, ప్రసాద్ పాల్గొన్నారు.

• ఇనుగుర్తి : మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి, గుట్టపైనున్న లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయాల్లో నాగుల చవితి సందర్భంగా మంగళవారం మహిళలు పుట్ట వద్ద పూజలు నిర్వహించారు.

• నర్సింహులపేట : మండల కేంద్రంతో పాటు బొజ్జన్నపేట, పెద్దనాగారం, కొమ్ములవంచ, వంతడుపల, రామన్నగూడెం, కౌసల్యదేవిపల్లి, జయపురం, ముంగిమడుగు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు జరిగాయి. మహిళలు పుట్టల వద్దకు వెళ్లి పాలు, కోడిగుడ్లు పుట్టలో పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

• కురవి : మండలంలో నాగుల చవితి పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కురవి మండల కేంద్రంలోని నాగేంద్రస్వామి ఆలయంలో పెద్దసంఖ్యలో మహిళ భక్తులు పుట్టలో పాలుపోసి, మొక్కులు తీర్చుకున్నారు. కార్తీకమాసం, నాగుల చవితి కావడంతో మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అధికారులు మహిళలకు టెంట్‌లు, తాగునీటి వసతిని కల్పించారు.

లైన్‌తండాను మరో గంగాదేవిపల్లిగా చేస్తా

• కాంగ్రెస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సురేష్‌నాయక్

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలం లైన్‌తండ గ్రామాన్ని మరోగంగాదేవి పల్లిగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆ గ్రామ కాంగ్రెస్ యూత్ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సురేష్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లైన్‌తండాలో పెళ్లికానీ ప్రతీ అమ్మాయికి పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు సాయం అందించనున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తానని చెప్పారు. గ్రామంలో సోలార్‌లైటింగ్, సైడ్ డ్రైనేజీ కాల్వలు, రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం తనవంతు సాయం అందిస్తానని చెప్పారు. పచ్చని వాతావరణం కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఇప్పటికే లైన్‌తండా, వంపుతండాతండాలలో నిర్మించిన దుర్గమ్మ ఆలయాలకు ఐరన్ తలుపులు బహూకరించినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని యూత్ సభ్యులకు రూ.30 వేలు అందించి క్రీడా పోటీలు నిర్వహించినట్లుచెప్పారు. గూడూరు-లైన్‌తండ-వంపుతండాలలో రహదారులకు ఇరువైపుల చెత్తచెదారంను తన సొంత ఖర్చులతో డోజర్ పెట్టి శుభ్రం చేయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గెలుపు అనంతరం గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన కవిత

మహబూబాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలపై వారు చర్చించారు. మహబూబాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పటిష్టానికి కృషి చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కేసీఆర్ సూచించినట్లు ఆమె తెలిపారు.


ఎర్రవల్లిలో కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాలోతు కవిత

మూడ్రోజుల పాటు ఆరోగ్య అవగాహన సదస్సు

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 5 : రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవాకేంద్రం నిర్వహణలో ఈ నెల 8,9,10 తేదీల్లో రైతు శిక్షణ కేంద్రం గుంటూరు జిల్లా కొర్నెపాడులో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ అవార్డు గ్రహీత, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ ఎడ్లపల్లి వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. చిరుధాన్యాలతో చేసే ఈకార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే రైతులు సెల్ : 97053 83666, 70939 73999 నెంబర్లకు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

ఇనుగుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించే పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఇనుగుర్తి జడ్పీహైస్కూల్లో ఎంఈవో రూపారాణి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈనెల 7న పాఠశాల, 21న మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి పొన్నం కవిత, గౌరవ అధ్యక్షుడు చిన్నాల కట్టయ్య, వి.చంద్రమోహన్, బూర రజనీకాంత్, అన్నం యాకయ్య, ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆషా, హమీన్ కౌస్, ప్రణయ్, స్వప్న, వెంకమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎంఈవోకు ఘన సన్మానం

బయ్యారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇక్కడ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లిన పూల్ చంద్‌ను బయ్యారంలో మంగళవారం ఉపాధ్యాయ సంఘ నేతలు సంయుక్తంగా సన్మానించారు. టీఎస్‌టీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, టీపీటీఎఫ్, ఏటీఎఫ్, ఎస్సీపీఈయు ఉపాధ్యాయ సంఘ నేతలు బయ్యారం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పూల్‌చంద్‌ను ఘనంగా సన్మానించారు.

'వేతనాలు ఇవ్వకుండా సతాయిస్తున్న క్వారీలు'

కేసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రానైట్ క్వారీలు, కంకర క్రషర్ మిల్లుల్లోని కార్మికులకు నెలల తరబడి వేతనాలను ఇవ్వకుండా యాజమాన్యాలు సతాయిస్తున్నాయని ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపెల్లి మొగిలి, జాటోత్ బిచ్యానాయక్ ఆరోపించారు. ఈ మేరకు మహబూబాబాద్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కేసముద్రంలో వారు మాట్లాడుతూ క్వారీల్లో మూడు నుంచి ఆరునెలల పాటు వేతనాలివ్వకుండా కార్మికులతో పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాల్లోని నిబంధనలు అమలు చేయడం లేదని, వాటిని సక్రమంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా రామచంద్రు


అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన రామచంద్రు, దుడ్డెల బ్రహ్మం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షులుగా సింగారం గ్రామానికి చెందిన దొంతర బోయిన రామచంద్రు, ప్రధాన కార్యదర్శిగా మాధవాపురంకు చెందిన దుడ్డెల బ్రహ్మంను ఎన్నుకున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కత్తుల మల్సూర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. తమ ఎన్నికకు సహకరించిన కత్తుల మల్సూర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'నూతన సమాజం కోసం పోరాడుదాం'


లదాయిగడ్డలో నినాదాలు చేస్తున్న ఎన్డీ నాయకులు

కొత్తగూడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమరుల ఆశయ సాధన కోసం అసమానతలు లేని నూతన సమాజం కోసం పోరాడుదామని ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. లదాయిగడ్డ, కొర్రతండా, ముస్మీ, రామన్నగూడం, వేలుబెల్లిలో ఎన్డీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించారు. నాయకులు భూక్య వెంకటయ్య, శ్రీశైలం, పసునూరి రాజమల్లు, గట్టి సురేందర్, పిట్టల దేవేందర్, రాసమల్ల శ్రీను, రవీందర్, సత్యనారాయణ, రాఘవులు, రామ్‌సింగ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యం : ఎంఈవో

నర్సింహులపేట, నవంబరు5 : సైన్స్‌తోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమని ఎంఈవో రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక హైస్కూల్‌లో చెకుముఖి పోటీల గోడపత్రికలను ఉపాధ్యాయులతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 7న పాఠశాల స్థాయి, 21న మండలస్థాయి, 28న జిల్లాస్థాయి పోటీలు ఉంటాయన్నారు. జనవిజ్ఞానవేదిక మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ, జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి భూక్యా నాగేష్, చెకుముఖి కన్వీనర్ శశికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలి'


సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తొర్రూరులో మాస్‌లైన్ జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలుపర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, యాకయ్య, జె. యాకయ్య, వెంకన్న, కేశవులు, వెంకటయ్య, సంతోష్, సాయిలు, పద్మ పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జయప్రదంచేయాలి

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 7న జరిగే ఎంసీపీఐ(యూ) జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ పిలుపునిచ్చారు. సదస్సు జయప్రదం కొరకై ముద్రించిన వాల్‌పోస్టర్లను గూడూరులో మంగళవారంఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీల జాతీయ నాయకులు సాదినేని వెంకటేశ్వర్‌రావు, వేములపల్లి వెంకట్రామయ్య, కెజి.రాంచందర్ హాజరవుతున్నారన్నారు. నాయకులు బందెల వీరస్వామి, ఈసం రామయ్య, గుండగాని సత్తయ్య, బుచ్చిరామయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలి

చిన్నగూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని ఏపీసీ చైర్‌పర్సన్ సైదమ్మ, ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ కోరారు. మంగళవారం జయ్యారం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పృథ్వీరాజ్ మిత్రులైన సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రశాంత్ రూ.12,000 విలువ గల బెల్ట్‌లను, శేషగిరిరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటేష్ రూ.10,000వేల విలువ గల ఐడీ కార్డులను సమకూర్చగా ఏపీసీ చైర్‌పర్సన్ సైదమ్మ, ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు తేజోన్నతరెడ్డి, రామకృష్ణ, పృథ్వీ రాజ్, ఉపేందర్, ఫిరోజ్‌కాన్, పృథ్వీరాజ్, రమదేవి, శ్రీనివాస్, సునిత, మంజుల, శ్రీనివాస్, స్వామినాథ్, కృష్ణ, మనోజ్ఞ పాల్గొన్నారు.

'సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల రైతులు నెక్కొండలో ప్రారంభమైన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావూల హరీ‌ష్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి అన్నారు. గూడూరు మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిల్లర కాంటాల వద్ద పత్తిని విక్రయించి మోసపోవద్దని, సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలోనే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని చెప్పారు.

అమరులైన వారిని స్మరించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేదల రాజ్యం కోసం జరిగిన పోరుబాటలో అమరులైన వారిని స్మరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కేసముద్రం సంయుక్త మండలాల కార్యదర్శి ఫైండ్ల యాకయ్య అన్నారు. మహబూబాబాద్ మండలం సండ్రాలగూడెంలో మంగళవారం జరిగిన సమావేశంలో యాకయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, దేశ విముక్తి లక్ష్యంగా ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటం నక్సల్బరి శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతి ఘటన పోరాటంలో అమరులైన వారి ఆశయాల కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, అలకుంట్ల కొమురయ్య, రఫీ, ప్రశాంత్, సతీష్, రమేష్, కృష్ణ, సంపత్, నవీన్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రి అయినప్పటికీ వాటిని పరిష్కరించలేదన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు సంతోష్, మహేందర్, రాజు, రమేష్, శివకుమార్, వెంకటేశ్వర్లు, హరిబాబు, నాగిరెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కేసముద్రం, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చీకటి ఉపేందర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఎఫ్‌లో ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బులను ఇవ్వకుండా ప్రభుత్వం నెలల తరబడి జాప్యం చేస్తోందని ఆరోపించారు. మండల అధ్యక్షుడు గుండు సురేందర్, ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు, వీసం నర్సయ్య, ప్రణయ్, శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ నియమనిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సురేష్‌నాయక్, హత్తీరాంనాయక్ ఉన్నారు.

ఆశా వర్కర్లకు రికార్డుల పంపిణీ


ఆశా వర్కర్లకు రికార్డులను పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్ రవి

మరిపెడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు మంగళవారం మరిపెడ మండల మెడికల్ ఆఫీసర్‌రవి దినచర్య రికార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆశా వర్కర్లకు విధులపై అవగాహన కల్పించారు. నిత్యం చేయాల్సిన దినచర్యలను వివరించారు. డాక్టర్ స్వామి, పల్లె దవాఖాన సిబ్బంది సిరి, సాయిశ్రీ, అఖిల, యూన్సీ, ఉపేంద్ర, సతీష్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు, లక్ష్మీకుమారి, మాధవి, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ

మహబూబాబాద్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేదలను విస్మరించిన ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ విమర్శించారు. మహబూబాబాద్ పెరుమాండ్లజగన్నాథం భవన్‌లో మంగళవారం టౌన్-1 ఏరియా కమిటీ సీపీఎం మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం 11 మందితో టౌన్-1 ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రావుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, చీపిరి యాకయ్య, హేమానాయక్, కుమ్మరికుంట్ల నాగన్న, గౌని వెంకన్న, శ్రీనివాస్, శాగంటి భాగ్యమ్మ ,రమాదేవి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నక్క సైదులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు విల్‌చైర్‌లు అందజేత

నెల్లికుదురు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగులైన వనగండ్ల గట్టుస్వామి విజయ దంపతులకు సామాజిక కార్యకర్త గంగరబోయిన రఘు మంగళవారం వీల్‌చైర్‌లు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగులు గట్టుస్వామి విజయ దంపతులకు ఆర్థిక సహాయం కావాలని సామాజిక మధ్యమాలలో ప్రసారం కావడంతో అమెరికాలో ఉన్న తనస్నేహితునికి సమాచారం ఇచ్చామన్నారు అమెరికాలోఉన్న ప్రశాంత్ అనే ఉద్యోగి స్పందించి వీల్‌చైర్‌లకు ఆర్థిక సహాయం అందించాడన్నారు. ఈ కార్యక్రమంలో గూడురు సంతోష్, బండారి కార్తిక్, ఏర్పుల హరీష్, సురేష్, నరేష్, నిరంజన్ పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ సభల పోస్టర్ల అవిష్కరణ

మరిపెడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యూఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభల పోస్టర్లను జన విజ్ఞాన వేదిక మండల బాధ్యులు రాంమోహన్, జనార్థనాచారి మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబరు 14, 15వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో జరుగనున్నట్లు యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్దబోయిన వీరబాబు పేర్కొన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు దేవ్లా, నెహ్రూ, ప్రసాదరావు, ప్రకాశ్, లెనిన్, శౌరీ, అనిత పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శప్రాయుడు చిత్తరంజన్‌దాస్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖన్యాయవాది, దేశబంధు చిత్తరంజన్‌దాస్ అందరికీ ఆదర్శప్రాయుడని డాక్టర్ నాగరాజు కొనియాడారు. మహబూబాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన జయంతిని నిర్వహించి. చిత్తరంజన్‌దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గురువులకే గురువు చిత్తరంజన్‌దాస్ అని పేర్కొన్నారు. దేశ సేవ కోసం స్వదేశీ వస్త్రాన్ని ధరించారని కొనియాడారు. ప్రిన్సిపాల్ మధు మాట్లాడుతూ స్వతంత్ర్య సమరయోధుల త్యాగాలను పాఠశాల విద్యార్థులకు నేతాజీ సేవా సమితి గుర్తు చేసి వారిలో దేశభక్తిని పెంపొందించేకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి బాధ్యులు లక్ష్మణ్, వివేక్, గంగాధర్, రోహిత్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

కురవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో క్షేత్రసాయిలో పారదర్శకత పాటించి అర్హులైన పేదలకు లబ్ధి చేకూర్చాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవిలో మంగళవారం నిర్వహించిన సీపీఐ గ్రామ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని, డిసెంబర్ 25 నుంచి పార్టీ శతజయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, గ్రామ కార్యదర్శి తురక రమేష్, దూదికట్ల సారయ్య, నిలుగొండ నాగేశ్వర్‌రావు, బొల్లం ఉప్పలయ్య పాల్గొన్నారు.

'ఎస్సీ బాలికల హాస్టల్ భవనాన్ని నిర్మించాలి'


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కురవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కురవిలో ఎస్సీ బాలికల హాస్టల్ నూతన భవనాన్ని తక్షణమే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ హాస్టల్ శిథిలావస్థలో ఉందని, విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ సునీల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కొలిపాక వీరేందర్, వైష్ణవి, మానస, పావని, మౌనిక, చందు, సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు


బాలికల హాస్టల్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివరామ్

ఇనుగుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శివరామ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 8 నుంచి పదో తరగతికి చెందిన 122 మంది విద్యార్థినులకు రక్తహీనత లోపాన్ని గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. విద్యార్థినులకు అవసరమైన మందులను పంపిణీ చేసి కొందరికి పీహెచ్‌సీకి సిఫారసు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ ఆషా, వైద్య సిబ్బంది సునీత, సుమలత, హేమలత, పద్మ, రజిత, నాగమణి పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లలు పంపిణీ

నర్సింహులపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పడమటిగూడెంలో ముదిరాజ్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత చేపపిల్లలను గ్రామంలోని గంగదేవికుంట, ఊరకుంటలలో కాంగ్రెస్ శ్రేణులతో పాటు ముదిరాజ్‌లు వదిలే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల ఉప్పలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనుప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముదిరాజ్ సొసైటీ సభ్యులు యాకయ్య, గువ్వ వెంకన్న, సంతోష్, నాగరాజు, సారయ్య, వీరన్న, లింగయ్య, అశోక్, షై పాషా, ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.